





**ఆ ఇంటి ముందు ఓ గుంపు!**

అందరిలోనూ హడావుడి!

"ఏమైంది సార్ ఏమైంది?" ఆ ఇంటి యజమాని గోపాల్ నెవరో అడుగుతున్నారు.

"ఏం లేదండి.... ఆఫీసునుంచి ఇంటి కొచ్చాను. పావుగంటనుంచి తలుపు తడుతున్నాను.... ఇంతవరకు మా ఆవిడ తలుపు తీయటం లేదు.... తలుపులా తాళాలు వేసిలేవు...."

"పెరటివైపు చూశారా?" అతి తెలివి ప్రదర్శించాననుకున్నాడా పెద్దమనిషి.

"అన్నివైపులా చూశాం. తలుపులన్నీ మూసున్నాయి.... ఎంత పిలిచినా, అరచినా తలుపులు మాత్రం తెరుచుకోవటం లేదు."

"ఎందుకనంటారు?"

"ఏమోనండి అదే నాకూ అర్థం కావటంలేదు" ఆదుర్దా.

"భార్యా భర్తల మధ్య కీచులాట లేమీ లేవు కదా?" 'కీడెంచి మేలెంచ' మన్న సూక్తిలో నమ్మకమున్న యింకో పెద్ద మనిషి ప్రశ్న.

గుండె గుభేల్‌మంది గోపాల్‌కి ఆ మాట వినగానే.

ఉదయం ఆఫీసు కెళ్ళేటప్పుడు చిన్న కీచులాట జరిగింది.

అదే అన్నాడు ఆ పెద్ద మనిషితో.

"ఏం జరిగిందేమిటి?" అడిగాడా పెద్ద మనిషి.

"ఏముంది ఈవేళ. తొడుక్కోవాల్సిన బట్టలుతీసి రడీగా వుంచలేదు. అందుకని కోపమొచ్చి ఏవో నాలుగు మాటలన్నాను. ఆమే అంది. నేనింకా అన్నాను. ఆమె యెదురెంతపడంతో ఏడ్చి పండి.... అంతే. యింకేం జరగలా" చావు కబురు చల్లగా చెప్పినట్లు చెప్పాడు.

"అయితే, ఇంకే.... మాట పడటం ఇష్టంలేక ఏ అఘాయిత్యమో చేసుంటుంది...."

గోపాల్ గుండె దడ పెరిగింది.

"ఈ మాత్రానికే చచ్చిపోతారటండి?!" ఇంకో పెద్దమనిషి కళ్ళగజేసుకున్నాడు.

అంతలో అక్కడికొచ్చిన పక్కింటి 'పిన్నిగార్ని చూసేసరికి ప్రాణం లేచొచ్చింది. 'ఆమెకేమైనా తెలుసుండచ్చు' అని ఆశ.

"ఏమండి మధ్యాహ్నం మా 'లలిత'ను చూశారా?"

"లేదబ్బాయ్! ఇందాక అరగంటపైనే అవుతుంది. కాఫీ పొడుంకోసం వచ్చాను. ఎంతసేపు పిలిచినా పలకలా - "సర్లే నిద్రపోతోంది" అని ఊరుకున్నాను...."

అంతే.. అతని గుండె ఆగిపోయినంత పనయింది.. అతని ఆలోచనల్లో భయం!

లలిత తల్లితండ్రులకి ఏం సమాధానం చెప్పాలి? పోలీసు లొస్తే వాళ్ళకేం చెప్పాలి?

ఎవరో పలుగు, పార తీసుకొచ్చారు. తలుపు పగలకొట్టమన్నట్టుగా.

ఆఖరి ప్రయత్నంగా గట్టిగా తలుపు చప్పుడు చేస్తూ అరిచాడు గోపాల్.

అందరి దృష్టి ఆ తలుపులమీదే.

అయినా అవి తెరుచుకోలేదు.

ఇక తప్పదన్నట్టు సైగ చేశాడు.

తలుపులు పగలకొట్టే ప్రయత్నం.

"కంగ్".. "కంగ్".. దెబ్బమీద దెబ్బ....

అంతలో తలుపులు తెరుచుకున్నాయి.

అందరూ ఆశ్చర్యపోయారు.

ఎదురుగా ఆమె!

మామూలుగా ఎప్పటిలానే ఉంది.

"ఏమిటి ఏం చేస్తున్నారు?"

ఇది బయటవాళ్ళ ప్రశ్నకాదు. ఆమె ప్రశ్నే....

లోపల—

లైటు వెలుగుతోంది!

ఫాను తిరుగుతోంది!

పరుపుమీద గిరిజా కళ్యాణం పెద్ద సైజు నవల ఒకటి - చదువుతూ సగం ఆపినట్లు - బోర్లించి ఉంది. ★

నేనిలా కూడా క్రాఫు చెయ్యగలను-సార్!!

